

జగనన్నను మించిన పాలకుడు లేడు

ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మించిన పాలకుడు లేడని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. అనంత పురంలో ఆమె మాట్లాడారు. 8లో



టమాట కిలో రూ.12

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.12 పలికింది. కనిష్టం రూ.4. సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
39.5°/20.9°

జిల్లాలో ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగింది. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'



పుట్టపర్తి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి 'స్పందన' కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం, ధర్మవరం, కదిరి ఆర్డీఓ కార్యాలయాలు, మండల స్థాయిలోనూ 'స్పందన' ఉంటుందన్నారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అర్జీలపై ఆధార్, ఫోన్ నంబర్ తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు.

నేడు ఎస్పీ కార్యాలయంలో 'స్పందన'

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం 'స్పందన' నిర్వహించనున్నారు. ప్రజలు తమ సమస్యలపై ఎస్పీకి నేరుగా అర్జీలు అందజేయవచ్చు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయ అధికారి మురళీకృష్ణ

అనంతపురం ఎడ్యుకేషన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన రాత పరీక్ష ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. 5వ తరగతి ప్రవేశ పరీక్ష మొత్తం 16 పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. 480 సీట్లకు గాను 10,234 మంది దరఖాస్తు చేసుకోగా , 9,395 మంది హాజరయ్యారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 1200 సీట్లకు గాను 5,596 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 4,785 మంది హాజరయ్యారని అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల ఉమ్మడి జిల్లా సమన్వయ అధికారి మురళీకృష్ణ తెలిపారు.

మేళాపురంలో పేలిన గ్యాస్ సిలిండర్

- నలుగురికి గాయాలు



గాయపడిన లక్ష్మీదేవి, భరత్

హిందూపురం అర్బన్: పట్టణంలోని మేళాపురంలోని బ్యాంక్ కాలనీలోని ఓ ఇంట్లో ప్రమాదవశాత్తూ గ్యాస్ సిలిండర్ పేలడంతో నలుగురికి గాయాలయ్యాయి. భరత్, లక్ష్మీదేవి దంపతులు బ్యాంక్ కాలనీలో ఉన్న ఓ రేకుల ఇంటిలో ఉంటున్నారు. లక్ష్మీదేవి ఆదివారం ఉదయం వంట చేస్తుండగా ఉన్న ఫలంగా గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో భరత్ (34), లక్ష్మీదేవి (30)తో పాటు వారి పిల్లలు అఖిల (9), వర్షిత (11) గాయపడ్డారు. ఇంటి పైకప్పుకు ఉన్న రేకులు , ఇంటి తలుపులు ధ్వంసమయ్యాయి. ఇంటి నుంచి పెద్ద శబ్దం రావడంతో చుట్టు పక్కల వారు పరుగులు తీశారు. వెంటనే గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని వన్‌టౌన్ పోలీసులు పరిశీలించి ప్రమాదవశాత్తూ జరిగిన సంఘటనగా గుర్తించారు. సీఐ శ్రీనివాసులను వివరణ కోరగా బాధితులకు స్వల్ప గాయాలయ్యాయని, ప్రమాదం ఏమీ లేదని తెలిపారు.

హ్యాండ్‌బాల్ చాంపియన్ 'అనంత'



ట్రోఫీ అందుకుంటున్న అనంతపురం జట్టు

కర్నూలు (టౌన్): రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పురుషుల చాంపియన్‌షిప్‌ను అనంతపురం జట్టు దక్కించుకుంది. పశ్చిమగోదావరి జిల్లా రన్నర్‌గా నిలవగా.. కర్నూలు జట్టు మూడో స్థానంతో సరిపెట్టుకుంది. కర్నూలు నగర శివారులో 52వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పురుషుల చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. విజేతలకు ట్రోఫీలను గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అందజేశారు. రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, వివిధ జిల్లాల క్రీడా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం

- 1,571 పోలింగ్ కేంద్రాలు రెడీ
- 11 వేల మంది సిబ్బంది నియామకం
- ఎన్నికల విధులపై అధికారులకు అవగాహన



హిందూపురం వద్ద కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు (ఫైల్)



ఈవీఎంలను పరిశీలిస్తున్న జేసీ, ఆర్డీఓలు

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధమైంది. ఎన్నికల్లో ప్రధాన భూమిక పోషించనున్న రెవెన్యూ అధికారులు, మరో పక్క పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఎన్నికల కమిషన్ ఆదేశాలు, సూచనలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాల పునర్విభజన తర్వాత జరుగుతున్న తొలి సార్వత్రిక ఎన్నికలు కావడంతో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ఒకవైపు రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎన్నికల కమిషన్ సూచనలు తెలియజేస్తూనే క్షేత్రస్థాయిలో పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన, సమస్యాత్మక కేంద్రాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవడం, ఎలక్ట్రానిక్ ఓటింగ్ ద్వారా జరిగే ఎన్నికల్లో ముఖ్యమైనవి వీవీ ప్యాట్, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్ యంత్రాలను వినియోగిస్తుండడంతో వాటిపై స్వీప్ ద్వారా అవగాహన తదితర కార్యక్రమాలు పూర్తి చేశారు. క్లెయిమ్‌ల పరిష్కారం, నూతన ఓటర్లుగా నమోదు, మరణించిన ఓటర్లను జాబితా నుంచి తొలగించడం వంటి చర్యలు సాగుతూనే ఉన్నాయి. ప్రతి ఓటరూ ఒక ఎమ్మెల్యే, ఒక ఎంపీకి కలిపి రెండేసి ఓట్లు వేయాల్సి ఉంటుంది. ఇందు కోసం ఒక ఓటరు లోనికి వెళ్లినప్పటి నుంచి ఓటు వేసి బయటకు రావడానికి 5 నిమిషాల సమయం కేటాయిస్తారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు చర్యలు

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ఈసారి దాదాపు 11 వేల మంది సిబ్బందిని వినియోగించనున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఆరుగురు చొప్పున సిబ్బందిని నియమించారు. జిల్లాను 195 రూట్లుగా విభజించి పర్యవేక్షించనున్నారు. ఒక రూట్‌ను ఒక అధికారి పర్యవేక్షిస్తారు. ఇక జిల్లాలో 6,97,119 మంది మహిళా ఓటర్లు, 6,94,446 మంది పురుష ఓటర్లు, 1,364 సర్వీస్ ఓటర్లు, ఇతరులు 63 మంది కలిపి మొత్తం 13,92,992 మంది ఓటర్లు ఉన్నారు. ఓటరు తుది జాబితా అనంతరం నామినేషన్ వరకు నూతన ఓటరు నమోదు కార్యక్రమం కొనసాగుతుంది. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో సుమారు 91,647 మంది నూతన ఓటర్లు పెరిగారు. ఇంకా పెరగవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

39వేల మందికి ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం

పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేని వారి కోసం ఎన్నికల కమిషన్ ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పించింది. 80 ఏళ్ల వయసు దాటిన వారు, కరోనా పేషెంట్లు, 40 శాతం పైగా వైకల్యం కలిగిన దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు వేయవచ్చు. ఎన్నికల నోటిఫికేషన వెలువడిన అనంతరం సంబంధిత ఓటర్లు ముందుగానే బీఎల్ఓ ద్వారా ఫారం 12డీ తో దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత ఎన్నికల అధికారి అనుమతిస్తే ఇంటి నుంచే ఓటు వేయవచ్చు. జిల్లాలో ఇలాంటి ఓట్లు వృద్ధులు 21,161 మంది, దివ్యాంగులు 18,014 కలిపి 39,175 మంది ఉన్నారు. వంద శాతం ఓటింగ్ చేయించాలనే ఉద్దేశంతో కమిషన్ అన్ని చర్యలూ తీసుకుంటోంది.

సమస్యాత్మక కేంద్రాలు గుర్తింపు

సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి అక్కడ పటిష్టమైన ఏర్పాట్ల ద్వారా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి ఎస్పీ మాధవరెడ్డి అన్ని చర్యలూ తీసుకుంటున్నారు. జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో 1,571 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. ఇప్పటి వరకూ జరిగిన అన్ని ఎన్నికల్లో ఎక్కడైనా సమస్యలు తలెత్తడం, పోలింగ్ బూత్‌ల్లో ఇబ్బంది కలిగించడం, ఓటర్లకు ఇబ్బంది కలగడం తదితర ఘటనలు చోటు చేసుకున్న 270 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. నియోజకవర్గ కేంద్రాల్లో పోలీస్ కవాతు నిర్వహించి ప్రశాంతంగా ఓటుహక్కు వినియోగించుకోండని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. సమస్యాత్మక కేంద్రాల్లో ఇప్పటికే రెవెన్యూ, పోలీస్ అధికారులు పర్యటించారు.

ఎన్నికల సామగ్రి సిద్ధం

సార్వత్రిక ఎన్నికలకు అవసరమైన సామగ్రిని ఇప్పటికే సిద్ధం చేశారు. ధర్మవరం మార్కెట్ యార్డులో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, కంట్రోల్ యూనిట్‌లు, బ్యాలెట్ యూనిట్ నిల్వ చేశారు. ఇందులో ప్రతి పోలింగ్ కేంద్రంలో రెండేసి ఓట్లకు రెండేసి యంత్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం 3,142 చొప్పున వీవీ ప్యాట్‌లు, కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు ఉన్నాయి. వీటికి అదనంగా మరో 628 యంత్రాలు అందుబాటులో ఉంచారు. ఇక పోలింగ్ కేంద్రంలోని యంత్రాలకు అవసరమైన బ్యాటరీలు, సీక్రెట్ పోలింగ్ కంపార్ట్‌మెంట్ బాక్సులు, ఇంకు, పోలింగ్ అధికారులకు అందజేసే పుస్తకాలు, పెన్నులు, రికార్డులు కలెక్టరేట్‌లో సిద్ధంగా ఉంచారు.

ఎన్నికలకు ఏర్పాట్లు రెడీ

సార్వత్రిక ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంది. రాజకీయ పార్టీల ప్రతినిధులకు, ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాము. ఎన్నికలకు కావాల్సిన యంత్రాలు, సామగ్రి వచ్చేశాయి. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు సమకూర్చాం. కౌంటింగ్ కేంద్రాలను గుర్తించి అవసరమైన ఏర్పాట్లు చేయడానికి ఆదేశించాం. జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడానికి అన్ని చర్యలూ తీసుకుంటున్నాం.

– అరుణ్‌బాబు, కలెక్టర్

మద్యం దుకాణంలో భారీ చోరీ

బత్తలపల్లి: ప్రభుత్వ మద్యం దుకాణంలో భారీ చోరీ జరిగింది. అర్ధరాత్రి వేళ దుండగులు లోనికి ప్రవేశించి నగదు, మద్యం బాక్సులను అపహరించుకుపోయారు. దుండగులు ఆనవాళ్లు దొరక్కుండా జాగ్రత్తపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... బత్తలపల్లి మండల కేంద్రంలో ధర్మవరం రోడ్డువైపున బ్యాంకు సమీపంలో ప్రభుత్వ మద్యం దుకాణం ఉంది. సూపర్‌వైజర్‌గా విజయ్‌కుమార్, సేల్స్‌మెన్లుగా రామచంద్రారెడ్డి, నారాయణస్వామి నాయక్ విధులు నిర్వహిస్తున్నారు. మద్యం విక్రయించిన నగదును దుకాణంలో గల లాకర్‌లో భద్రపరచి.. మరుసటి రోజు బ్యాంకులో డిపాజిట్ చేస్తుంటారు. శివరాత్రి పండుగ సందర్భంగా రెండు రోజులుగా బ్యాంకులకు సెలవులు వచ్చాయి. శనివారం వరకు విక్రయించగా వచ్చిన నగదును లాకర్‌లోనే భద్రపరిచారు. ఇదే అదనుగా భావించిన దుండగులు పక్కా పథకం ప్రకారం శనివారం అర్ధరాత్రి తాళాలను మెండి లోపలికి ప్రవేశించారు. సీసీ కెమెరాలు ధ్వంసం చేసి.. వాటికి సంబంధించిన హార్డ్ డిస్క్‌ను తీసేసుకున్నారు. లాకర్‌లోని రూ.10,98,550 నగదుతో పాటు రూ.3,33,310 విలువ చేసే వివిధ రకాల మద్యం కేసులు ఎత్తుకెళ్లిపోయారు. ఇంత జరిగినా వాచ్‌మెన్లు నరసింహులు, రామచంద్ర నిద్రమత్తులోనే ఉండిపోయారు. ఆదివారం తెల్లవారుజామున నిద్రలేచిన వాచ్‌మెన్ నరసింహులు.. షాపు తలుపులు, లాకర్ తెరిచి ఉండటంతో సూపర్‌వైజర్, సేల్స్‌మెన్‌లకు ఫోన్ ద్వారా తెలిపారు. వారు అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారమందించారు. హెడ్‌కానిస్టేబుల్ రామాంజనేయులు సంఘటన స్థలానికి వెళ్లి అక్కడి నుంచే ఉన్నతాధికారులకు సమాచారం చేరవేశారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ బాలకృష్ణ, సీఐ గౌరీప్రియ, ఎస్ఐ నారాయణ, డిపో సిబ్బంది బత్తలపల్లికి చేరుకున్నారు. ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, రూరల్ సీఐ ఆరోహణరావు, ఏఎస్ఐ సోమశేఖర్‌మూర్తి కూడా సంఘటనాస్థలానికి చేరుకున్నారు. అక్కడున్న దుకాణదారులను, వాచ్‌మెన్లను విచారణ చేశారు. అనంతరం పరిసరాలను పరిశీలించారు. సమీపంలోని బ్యాంకు, దుకాణాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. పుట్టపర్తి నుంచి క్లూస్ టీం వచ్చి ఆధారాలను సేకరించారు. అనంతరం సూపర్‌వైజర్ విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఆరోహణరావు తెలిపారు.

అంగరంగ వైభవం.. అగ్నిగుండ మహోత్సవం



అగ్నిగుండంలోకి ధూపం వేస్తున్న భక్తులు

హేమవతి(అమరాపురం): హేమావతి సిద్ధేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం అగ్నిగుండ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 8 గంటలకు ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా పూలతో అలంకరించి మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ఆవరణలో కుడివైపున ఉన్న అగ్నిగుండం వద్దకు తీసుకొచ్చి పూజలు చేశారు. అర్చకులతో పాటు ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ, ఈఓ నరసింహమూర్తి, కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి తదితరులు ధూపం వేసి అగ్నిగుండ మహోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేరుశనగ, చింతపండు,చింతకొమ్మలు, కందులు, దూపం, కొబ్బరి, రైతులు పండించిన నవధాన్యాలను అగ్నిగుండంలో వేశారు. ఇలా వేయడం వల్ల తమ కోరికలను స్వామివారు తీరుస్తారని భక్తుల నమ్మకం. పంటలో కొంత అగ్నిగుండంలో స్వామి వారికి సమర్పిస్తే పంటలు బాగా పండి చేతికందుతాయని రైతుల నమ్మకం. ఎన్నడూ లేని విధంగా దాదాపు 90 వేల మంది వరకు భక్తులు స్వామివారిని ఆదివారం దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా సీఐ రాజకుమార్, ఎస్ఐ జనార్దననాయుడు ఆధ్వర్యంలో పోలీసులు క్యూలైన్‌లో దర్శనానికి పంపించారు. జడ్జి డాక్టర్ కె.శివశంకర్ సిద్ధేశ్వరస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, వైఎస్సార్ సీపీ హిందూపురం పార్లమెంటు, మడకశిర అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలు బోయ శాంతమ్మ, ఈరలక్కప్పతో పాటు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్, జిల్లా కార్యదర్శి శివకుమార్, బీసీ విభాగం ఉపాధ్యక్షుడు హలుకూరు కాంతరాజు, లు మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

మేనల్లుడే కాల యముడు

- అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఖోకలే దారుణ హత్య



మూర్తిరావు (ఫైల్)

అనంతపురం: మేనల్లుడే కాలయముడయ్యాడు. వ్యక్తిగత కక్షతో కత్తితో గొంతు కోసి దారుణంగా హతమార్చాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం జిల్లా పామిడికి చెందిన మూర్తిరావు ఖోకలే దశాబ్దాల క్రితమే అనంతపురంలోని జేఎన్‌టీయూఏ ప్రధాన ద్వారం ఎదురుగా స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. ఆయనకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆరేళ్లుగా అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ఐదారు నెలలుగా కుమార్తెకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఈ క్రమంలోనే నాలుగు నెలల క్రితం అనంతలక్ష్మిలో ఉద్యోగం మానేశారు.

భార్య కళ్లెదుటే దారుణం

జేఎన్‌టీయూ ప్రధాన ద్వారం ఎదురుగా మూర్తిరావుకు షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు సొంతిల్లు ఉంది. అన్నింటినీ అద్దెకు ఇచ్చేసి నగరంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో కుటుంబసభ్యులతో కలసి ఉంటున్నారు. ఈ క్రమంలో తన ఇంట్లో నివాసముంటున్న మణికంఠ ఇల్లు ఖాళీ చేసి ఆదివారం మూర్తిరావుకు ఫోన్ చేశాడు. వచ్చి ఇంటిని పరిశీలించుకుని తాళం తీసుకెళ్లాలని సూచించాడు. దీంతో తన భార్య శోభతో కలసి ఆయన ఇంటి వద్దకు చేరుకున్నారు. ఇంటిని పరిశీలిస్తూ శోభ లోపలకు వెళ్లారు. అదే సమయంలో అక్కడే పొంచి ఉన్న మేనల్లుడు ఆదిత్య లోపలకు చొరబడి కత్తితో మూర్తిరావు (58) గొంతులోకి పొడిచాడు. రెప్పపాటులోనే పలు మార్లు పొడిచి, అనంతరం అదే కత్తితో గొంతుకోశాడు. కళ్ల ముందే జరుగుతున్న దారుణం చూసి, భయపడిన శోభ గట్టిగా కేకలు వేస్తూ బయటకు పరుగుతీసింది. ఇంతలో 'అత్తా... నేనేక్కడికీ పారిపోను.. ఇక్కడే ఉంటా' అంటూ ఆదిత్య అక్కడే ఉండిపోయాడు.

హతుడి పక్కనే కూర్చొని..

మూర్తిరావును హతమార్చిన అనంతరం నేరుగా ఇంటి వెనుక ఉన్న బాత్రూమ్‌కు ఆదిత్య వెళ్లి చేతికి అంటిన రక్తాన్ని శుభ్రం చేసుకుని, నేరుగా మూర్తిరావు మృతదేహం వద్దకు చేరుకుని పక్కనే కూర్చొని ఉండిపోయాడు. ఇంతలోనే అక్కడకు చేరుకున్న పోలీసులు వచ్చి ఆదిత్యను అదుపులోకి తీసుకున్నారు. కాగా, నాలుగు రోజుల క్రితం మూర్తిరావు ఇంటికి ఎదురుగానే బ్యాచిలర్‌లా పరిచయం చేసుకున్న ఆదిత్య ఓ గదిని అద్దెకు తీసుకుని అందులోకి మకాం మార్చినట్లు తెలుస్తోంది. పథకం ప్రకారమే మూర్తిరావును హత్య చేయాలని కుట్ర పన్నినట్లుగా సమాచారం. తమ కుటుంబాన్ని ఎదగనీయకుండా మామ చూస్తున్నారని, తనకు పెళ్లి సంబంధాలు రాకుండా అడ్డుకుంటున్నారనే అనుమానంతో హత్య చేసినట్లు పోలీసుల ఎదుట నిందితుడు అంగీకరించినట్లు తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వన్ టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. నిందితుడిని సోమవారం మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు.

వివాదరహితుడు

జేఎన్‌టీయూఏలో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో బీటెక్, ఎంటెక్ పూర్తి చేసి పీహెచ్‌డీ పొందిన మూర్తిరావు పలు ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. వివాదరహితుడు, సౌమ్యుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. సివిల్ ఇంజినీరింగ్‌లో నిష్ణాతుడు. మంచి పరిశోధకుడు. అందరినీ ఆప్యాయంగా పలకరించే మూర్తిరావు హత్యకు గురైన విషయం తెలియగానే నగరం ఉలిక్కిపడింది. ఆయనను కడసారి చూసేందుకు జేఎన్‌టీయూఏ ప్రొఫెసర్లు, అనంతలక్ష్మి కళాశాల విద్యార్థులు బారులు తీరారు. కాగా, మూర్తిరావు భార్య శోభ... శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం పినదర్రి గ్రామ జెడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. కొడుకు ఉజ్వల్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా, కుమార్తె వైష్ణవి బెంగళూర్‌లో బ్యాంక్ ఉద్యోగిగా స్థిరపడ్డారు.

జగన్ వెంటే గిరిజనం

- తండాలను పంచాయతీలు చేశారు
- టీటీడీ బోర్డులో స్థానం కల్పించారు
- గిరిజనులకు పదవులు ఇచ్చారు
- మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించుకుంటాం
- గిరిజన గర్జన సభలో నినాదం





అభివాదం చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్యే దుద్దుకుంట, సమన్వయకర్త శాంతమ్మ, గిరిజన ప్రతినిధులు, గిరిజన గర్జన సభకు హాజరైన గిరిజనులు

పుట్టపర్తి రూరల్: తమ జాతికి మేలు చేసిన సీఎం జగన్‌కే మా మద్దతు అని గిరిజనం నినదించింది. రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించి గుండెల్లో కొలువయ్యారని కీర్తించింది. తమ జీవితాలు మరింత బాగుపడాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించుకుని జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రి చేసుకుంటామని ప్రతినబూనింది. శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో వైఎస్సార్‌సీపీ గిరిజన జోనల్ ఇన్‌చార్జ్ దుంగావత్ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం 'గిరిజన జన గర్జన' నిర్వహించారు. ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు తిరుపాల్ నాయక్ ఎస్టీలకు జగనన్న ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. కృతజ్ఞత చాటుకునే విధంగా వచ్చే ఎన్నికల్లో గిరిజనులు వైఎస్సార్‌సీపీకి సంపూర్ణ మద్దతు తెలపాలన్నారు. ఈ సందర్భంగా గోరంట్ల జెడ్పీటీసీ పాలే జయరాం నాయక్, పెడపల్లి శ్రీరామ్‌నాయక్ ఉత్తేజ పరిచే ప్రసంగం చేశారు. గిరిజన మహిళలు సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో అలరించారు. 'జై జగన్' నినాదం ప్రతిధ్వనించింది. ఎన్నికల్లో జగన్ తరపున గిరిజనం సిద్ధం అంటూ సభా ప్రాంగణాన్ని హోరెత్తించారు.

అర్జునుడు జగన్

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమన్యుడు కాదని.. అర్జునుడని మంత్రి ఉషశ్రీచరణ్ అభివర్ణించారు. ఎన్ని పార్టీలు పొత్తులతో వచ్చినా విజయం సాధిస్తారని స్పష్టం చేశారు. గిరిజన గర్జన సభలో ముఖ్య అతిథిగా మంత్రి మాట్లాడారు. చంద్రబాబుకు రాజకీయ విలువలు లేవన్నారు. ప్రధాని మోదీని దేశద్రోహి అని తిట్టిన ఆయనే.. పొత్తు కోసం కాళ్ల బేరం చేసుకున్నాడని విమర్శించారు. గిరిజనులకు దేశంలో ఏ నాయకుడూ చేయని విధంగా జగన్ మేలు చేకూరన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలిలో మొదటిసారిగా గిరిజనులకు స్థానం కల్పించారన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, గృహ నిర్మాణం అన్ని రంగాల్లోనూ ఎస్టీలకు మరింత మేలు చేకూర్చారన్నారు. అన్ని పథకాల్లోనూ మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఎస్టీలకు ఒక కొమరం భీమ్‌లా సీఎం జగన్ నిలిచారన్నారు. అటువంటి మంచి నాయకునికి మరొక్కసారి గిరిజనులు మద్దతు తెలిపి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తేవాలని కోరారు.

తండాలను పంచాయతీలుగా మార్చారు

500 జనాభా కలిగిన గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా గుర్తించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. గిరిజనుల సంక్షేమానికి అండగా నిలిచారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా నేడు గిరిజన తండాల్లో ఎందరో డాక్టర్లు, ఇంజినీర్లు అయ్యారన్నారు. గత ఎన్నికల్లో ఇంటికో ఉద్యోగం, రైతు రుణాలు, డ్వాక్రా రుణాల మాఫీ అంటూ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా వంచించిన వ్యక్తి చంద్రబాబు అని దుయ్యబట్టారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, పువ్వు బాబు, పల్లి బాబులు జతకట్టి వస్తున్నారని.. గిరిజనులు జాగ్రత్తగా ఉండాలన్నారు. అభివృద్ధికి, అబద్ధానికి జరుగుతున్న యుద్ధంలో గిరిజనులు మరొకమారు జగనన్నకు మద్దతుగా నిలిచి జిల్లాలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేయాలని కోరారు.

జగనన్నతోనే బడుగులకు న్యాయం

జగనన్నతోనే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతోందని హిందూపురం పార్లమెంట్ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బోయ శాంతమ్మ అన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా బడుగు, బలహీన వర్గాలకు అన్నింటా భాగస్వామ్యం కల్పించారన్నారు. మరొక్కసారి జగనన్నను సీఎం చేయడం వల్లనే మరింత మెరుగైన జీవనం సాధ్యమవుతుందన్నారు.

ఇది పేదల ప్రభుత్వం

జగనన్నది పేదల ప్రభుత్వమని కదిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ అన్నారు. ఎన్నికల్లో సంక్షేమ లబ్ధి పొందిన పేదలే వైఎస్సార్‌సీపీ స్టార్ క్యాంపెయినర్లు అని అన్నారు. జగన్‌ను మరొక్కసారి సీఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు.

టీటీడీలో తొలిసారి చోటు

తిరుమల తిరుపతి దేవస్థానం చరిత్రలో మొట్టమొదటిసారిగా గిరిజనులకు పాలకమండలిలో చోటు కల్పించిన వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని టీటీడీ బోర్డు మెంబర్ అశ్వత్థనాయక్ తెలిపారు. దేవదేవుని చెంత ఇంత గౌరవప్రదమైన పదవి ఇవ్వడం పట్ల ఎస్టీ జాతిపై జగన్‌కున్న ప్రేమ ఏమిటో తెలిసిందన్నారు. శ్రీశైలం దేవస్థానంలో కూడా చోటు కల్పించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో 50 లక్షలకు పైగా ఓటు బ్యాంకు ఉన్న ఎస్టీల సంపూర్ణ మద్దతు వైఎస్సార్‌సీపీకేనని స్పష్టం చేశారు.

మంచికి అండగా ఉందాం

గిరిజనులకు జగనన్న చేసిన మేలు చరిత్రలో నిలిచిపోతుందని వైఎస్సార్‌సీపీ గిరిజన జోనల్ ఇన్‌చార్జ్ దుంగావత్ రమేష్ నాయక్ అన్నారు. 2029 డీ లిమిటేషన్‌లో 175 నుంచి 225 నియోజకవర్గాలు అవుతాయని, అప్పుడు మైదాన ప్రాంతంలోని గిరిజనులకు మరిన్ని రాజకీయ పదవులు దక్కుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

విశ్వాసానికి గిరిజనులు నిదర్శనం

గిరిజనులు విశ్వాసానికి నిదర్శనమని వైఎస్సార్‌సీపీ నాయకులు వజ్ర భాస్కర్‌రెడ్డి అన్నారు. ఇచ్చిన మాట తప్పని సీఎం జగనన్న బాటలో ఎస్టీ సోదరులు అదే స్వభావం కలిగి ఉంటారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపులో ఎస్టీల పాత్ర మరింత ఎక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాధాకృష్ణ, నాయకులు కేపీ కుళ్లాయప్ప, గిరిధర్ నాయక్, నాగే నాయక్, ఆంజనేయులు నాయక్, సేవే నాయక్, శివ శంకర్ నాయక్, రంగానాయక్, లక్ష్మానాయక్, పరశురాం నాయక్, సతీష్ నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రవి నాయక్, విజయ్ కుమార్ నాయక్, సునీతబాయి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

జగనన్నను మించిన పాలకుడు లేడు

- పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా
- మహిళా పాడి రైతులకు 'అమ్మ డెయిరీ' గిఫ్ట్ డీడ్‌ల అందజేత



అమ్మ డెయిరీని మహిళలకు అప్పజెబుతున్న మంత్రి ఆర్‌కే రోజా



హాజరైన మహిళలు

రాప్తాడురూరల్: ''ఆంధ్రప్రదేశ్‌లో జగనన్నను మించిన పాలకుడు లేడు. జగనన్నను మించిన పోరాట యోధుడు లేడు. జగనన్నను మించిన మనసున్న మారాజు లేడు. ఆంధ్రప్రదేశ్ గడ్డ రాజశేఖర రెడ్డి బిడ్డ జగనన్న అడ్డా'' అని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. అనంతపురం రూరల్ మండలం ఆలమూరు జగనన్న కాలనీ వద్ద ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన 'అమ్మ డెయిరీ' గిఫ్ట్ డీడ్‌లను ఆదివారం మంత్రి రోజా చేతుల మీదుగా మహిళా పాడి రైతులకు అందజేశారు. ముందుగా డెయిరీని పరిశీలించారు. అనంతరం డెయిరీ ఆవరణలో 'వైఎస్సార్ చేయూత' కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ మహిళల మోముల్లో చిరునవ్వు చూసేందుకు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రూ. 20 కోట్లు ఖర్చు చేసి పాల డెయిరీ ఏర్పాటు చేయడం చాలా సంతోషదాయకమన్నారు. రాప్తాడు ప్రజల కోసం ప్రకాష్‌రెడ్డి ఎన్నో కష్టాలు, నష్టాలు భరించారన్నారు. ఎన్నికల వరకు కనిపించని తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు ఇప్పుడు రెండు జెండాలు పట్టుకుని తిరుగుతున్నారని విమర్శించారు. దొంగలంతా కలిసికట్టుగా ఊర్లమీద పడ్డారని మండిపడ్డారు. 'మా అన్న 'తోపు' అని మీకు వీలైతే ఆపు' అంటూ పరిటాల ఫ్యామిలీకి సవాల్ చేశారు. రాప్తాడు గడ్డ తోపుదుర్తి బిడ్డ ప్రకాష్‌రెడ్డి అడ్డా అన్నారు.

ఒకసారి ఆలోచించండి

వైఎస్సార్ ఆసరా కింద డ్వాక్రా మహిళలకు నాలుగు విడతల్లో రూ. 25,570 కోట్లు జమ చేశారని మంత్రి రోజా పేర్కొన్నారు. వైఎస్సార్ చేయూత కింద రూ. 19,500 కోట్లు, పింఛన్ల కింద రూ.86 వేల కోట్లు జమ చేశారన్నారు. ఈ విధంగా ఏ రాష్ట్రంలోనైనా చేశారా? భవిష్యత్తులోనైనా చేస్తారా? ఆలోచించాలని కోరారు. 'జగనన్నను మళ్లీ సీఎం చేయడానికి మేము సిద్ధం.. మీరు సిద్ధమా', 'మహిళలను ఏమార్చే చంద్రబాబుకు చుక్కలు చూపించడానికి మేము సిద్ధం మీరు సిద్ధమా?', 'మహిళలంటే గౌరవం లేని పవన్‌కళ్యాణ్‌ను తరిమికొట్టడానికి మేము సిద్ధం, మీరు సిద్ధమా?' అని అడగ్గా మహిళలు ముక్తకంఠంతో 'సిద్ధం' అని బదులిచ్చారు. జగనన్న ప్రజల కోసం ఎలా బటన్ నొక్కారో... ఎన్నికల పోలింగ్ రోజున మీరు బటన్ నొక్కాలని కోరారు.

ప్రజల కోసం శాయశక్తులా కృషి

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులతో 2019 ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఎక్కడా అవినీతికి, అక్రమాలకు పాల్పడకుండా జనం సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా శాయక్తులా కృషి చేశానన్నారు. 17 వేల ఇళ్లను మంజూరు చేయించానన్నారు. ఒక్కసారి ఫ్యాను గుర్తుకు ఓటు వేసినందుకు 24 వేల ఇళ్లను తీసుకొచ్చానన్నారు. 2 వేలమంది పేద రైతులకు ఉచితంగా బోర్లు వేయించినట్లు తెలిపారు. 4 వేలమంది మహిళలకు ఉపాధి కోసం గార్మెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు 11.50 ఎకరాల భూములు కేటాయించామన్నారు. 30 వేలమంది ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మహిళా పాడి రైతుల కోసం రూ. 20 కోట్ల సొంత డబ్బు ఖర్చు చేసి అమ్మ డెయిరీ ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛ అయిన పేరూరు డ్యాంకు నీళ్లు తెచ్చుకున్నామని, బంగారు గనులను తెరిపిస్తున్నామన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలోని మహిళా పాడి రైతుల కోసం డెయిరీ అంకితం చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యమంత్రిని ఆదర్శంగా తీసుకుని ప్రకాష్‌రెడ్డి నియోజవకర్గ అభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త అభ్యర్థి శాంతమ్మ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ వరలక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ధనుంజయయాదవ్, పార్టీ మండల కన్వీనర్లు కె.రాధమ్మ, దుగుమర్రి గోవిందరెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, నాయకులు పవన్, వడ్డే శీనా, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'108'లో ప్రసవం



నవజాత శిశువును చూపుతున్న అంబులెన్స్ సిబ్బంది

అమరాపురం: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా 108 అంబులెన్స్‌లోనే ప్రసవించింది. వివరాలు... అమరాపురం మండలం మద్దనకుంట గ్రామానికి చెందిన శివరాజు భార్య రక్షితకు ఆదివారం ఉదయం పురిటి నొప్పులు మొదలయ్యాయి. దీంతో కుటుంబసభ్యులు స్థానిక స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ఎంత సేపటికీ ప్రసవం కాకపోవడంతో వైద్యుల సూచన మేరకు 108 అంబులెన్స్‌లో ఎక్కించుకుని మడకశిరలోని ప్రభుత్వాస్పత్రికి బయలుదేరారు. మార్గమధ్యంలో నొప్పులు అధికం కావడంతో వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి ఈఎంటీ నరసింహమూర్తి ఆమెకు కాన్పు చేశారు. పండంటి ఆడబిడ్డకు ఆమె జన్మనిచ్చారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు ధ్రువీకరించారు.

అంతర్జాతీయ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు ఎంపిక



రాజశేఖర్

గార్లదిన్నె: మండలంలోని కల్లూరు ఆర్‌ఎస్ గ్రామానికి చెందిన పుల్లన్న, అచ్చెమ్మ దంపతుల కుమారుడు రాజశేఖర్... అంతర్జాతీయ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. బీపీఈడీ పూర్తి చేసిన ఆయన ఓ ప్రైవేట్ పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రంలో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ - ఇన్‌డైరెక్ట్ టాక్స్ అండ్ నార్కోటిక్స్ (నాసిన్)లో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో ఒంగోలులో జరిగిన రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించిన ఆయన ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు ఎంపికయ్యారు. గత నెల 2 నుంచి 5వ తేదీ వరకూ తమిళనాడులోని రామనాథపురంలో జాతీయ స్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీల్లోనూ రాణించిన రాజశేఖర్ మే 2, 3 తేదీల్లో థాయిలాండ్‌లో జరిగే అంతర్జాతీయ పోటీల్లో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులతో పాటు టెన్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ రాజశేఖర్‌ను అభినందించారు.

మినీ బస్సు బోల్తా - డ్రైవర్ మృతి



శివకుమార్ (ఫైల్)



బోల్తాపడిన మినీ బస్సు

ధర్మవరం అర్బన్: మినీ బస్సు బోల్తాపడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బత్తలపల్లిలోని టీచర్స్ కాలనీకి చెందిన శివకుమార్ (36)కు భార్య చంద్రకళ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. మినీ బస్సు ఏర్పాటు చేసుకుని సొంతంగా డ్రైవింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం శివమాల వేసిన ఆయన... దీక్షలో భాగంగా ఇరుముడి కట్టుకుని కనగానపల్లి గ్రామానికి చెందిన తోటి శివభక్తులతో కలసి తన మినీ బస్సులోనే డ్రైవింగ్ చేసుకుంటూ శ్రీశైలానికి వెళ్లాడు. దైవదర్శనం అనంతరం తిరుగు ప్రయాణమైన శివకుమార్ తొలుత కనగానపల్లికి చేరుకుని భక్తులను సురక్షితంగా ఇళ్లకు చేర్చాడు. అనంతరం ఆదివారం తెల్లవారుజామున బత్తలపల్లికి తిరుగు ప్రయాణమయ్యాడు. పోతుకుంట ఫ్లెఓవర్ బ్రిడ్జిపై ప్రయాణిస్తుండగా నియంత్రణ కోల్పోవడంతో బస్సు బోల్తాపడింది. ఘటనలో శివకుమార్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వారసత్వ సంపదను కాపాడుకుందాం

- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి రోజా



మ్యూజియంను ప్రారంభిస్తున్న మంత్రి రోజా (చిత్రంలో) ఎమ్మెల్యే అనంత, కలెక్టర్ గౌతమి

అనంతపురం సెంట్రల్: వారసత్వ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. అనంతపురంలోని ఆదిమూర్తి నగర్‌లో ఆదిమూర్తినగర్‌లో నూతనంగా నిర్మించిన పురావస్తు మ్యూజియం భవనాన్ని ఆదివారం ఆమె ప్రారంభించి, మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జిల్లాలో అత్యంత సుందరంగా పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు జిల్లా పురావస్తు ప్రదర్శనశాల భవనాన్ని నిర్మించడాన్ని అభినందించారు. దాదాపు రూ.7కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ భవనంలో శిలాయుగం నాటి వస్తువులు, పూర్వ, చారిత్రక గ్యాలరీలు, రాతి, జైన శిల్పాలు, బూడిద ముద్దలు, ఇనుప పనిముట్లు, టెర్రకోట బొమ్మలు, ఇటుకలు, నాణేలు, పెయింటింగ్స్, చైనా వేర్, పింగానీ సామగ్రి, ఆయుధాలు తదితరాలు ఎన్నో ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. రాగి, పంచలోహాల విగ్రహాలు చూడముచ్చటగా ఉన్నాయన్నారు. పాఠశాల విద్యార్థులు తప్పనిసరిగా మ్యూజియంను సందర్శించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమికి సూచించారు. కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ.. శ్రీకృష్ణదేవరాయల కాలం నుంచి ఎంతో చరిత్ర కలిగిన ఈ జిల్లాలో అలనాటి చరిత్ర కళ్లకు కట్టినట్లుగా తెలుసుకునేలా మ్యూజియంను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పురావస్తుశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ వాణీమోహన్, ఎమ్మెల్యేలు అనంతవెంకట్రామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ దాసరి వాసంతిసాహిత్య, పురావస్తుశాఖ ఏడీ రజిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నెట్టికంటుడిని దర్శించుకున్న పురావస్తు శాఖ కమిషనర్



తీర్థ ప్రసాదాలను అందజేస్తున్న ఆలయ ఈఓ భద్రాజీ

గుంతకల్లు రూరల్: రాష్ట్ర పురావస్తు శాఖ కమిషనర్ జి.వాణీమోహన్ ఆదివారం రాత్రి కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ ఈఓ భద్రాజీ ఆధ్వర్యంలో అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలు, జ్ఞాపికను అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పుట్లూరు: మండలంలోని శనగలగూడూరు సమీపంలో చోటు చేసుకున్న ప్రమాదంలో యల్లనూరు గ్రామానికి చెందిన ధనలక్ష్మి(43) మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... ఆదివారం ఉదయం తన కుమారుడు గణేష్‌తో కలసి ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఆమె శనగలగూడూరు సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపు తప్పి కిందపడింది. ఘటనలో తలకు తీవ్ర గాయమైన ఆమెను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలి అక్క భూలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

రాప్తాడు: కుటుంబ సభ్యులు పెళ్లి చేయలేదంటూ క్షణికావేశానికి లోనై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాప్తాడుకు చెందిన తలారి నరేష్(23) అనంతపురంలో డిగ్రీ చదువుతూ ఫెయిల్ అయ్యాడు. ఈ క్రమంలో ఇంటి వద్దే ఉంటూ సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. ఇటీవల తను పెళ్లి చేయాలని కుటుంబసభ్యులను తరచూ అడుగుతూ వచ్చాడు. ఇప్పుడే పెళ్లి వద్దని, బాగా చదువుకుని జీవితంలో స్థిరపడిన తర్వాత పెళ్లి చేసుకోవాలని తల్లిదండ్రులు నచ్చచెబుతూ వచ్చారు. శనివారం సాయంత్రం మరోసారి పెళ్లి విషయంగా ఇంట్లో గొడవ పడిన నరేష్... రాత్రి అయ్యవారిపల్లి రోడ్డు వద్ద ఉన్న దొడ్డిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పలువురి పరామర్శ

నరేష్ మృతి చెందిన విషయం తెలియగానే గ్రామస్తులు, బంధువులు, మిత్రులు దిగ్భ్రాంతికి లోనయ్యారు. అందరితోనూ సఖ్యతగా ఉండే నరేష్ ఇక లేడనే వార్త తెలియగానే వారంతా శోకసముద్రంలో మునిగిపోయారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఆయన సోదరుడు చంద్రశేఖరరెడ్డి ఆదివారం ఉదయం అనంతపురంలోని జీజీహెచ్ మార్చురీలో ఉన్న నరేష్ మృతదేహాన్ని పరిశీలించి, నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు.

వైభవంగా చండీ హోమం



మహా మంగళ హారతి ఇస్తున్న అర్చకులు

లేపాక్షి: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని లేపాక్షిలోని వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం మధ్యాహ్నం చండీ హోమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్, కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి ఆధ్వర్యంలో వేదపండితులు సునీల్‌శర్మ సమక్షంలో దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. విశేష పూజల అనంతరం హోమం, ఉత్సవ మూర్తితో ప్రాకారోత్సవం నిర్వహించారు. శివపార్వతుల ఉత్సవ మూర్తులను సింహ వాహనంపై అధిష్ఠింపజేసి గ్రామంలో ఊరేగిస్తూ పార్వేట ఉత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆదినారాయణ, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బోర్ల అంజినరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మురళీరెడ్డి పాల్గొన్నారు. రాత్రికి ముత్యాల పల్లకి ఉత్సవం అంగరంగ వైభవంగా సాగింది.

వడదెబ్బతో కూలీ మృతి



ఓబులేసు

పామిడి: స్థానిక పామిడమ్మ వీధికి చెందిన వ్యవసాయ కూలీ బోయ ఓబులేసు (54) వడదెబ్బతో మృతి చెందాడు. పాగరూరు గ్రామానికి చెందిన ఆయన కొన్నేళ్ల క్రితం పామిడికి వచ్చి స్థిరపడ్డాడు. వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగిస్తున్నాడు. భార్య గోవిందమ్మ, ఓ కుమారుడు ఉన్నారు. ఆదివారం వ్యవసాయ కూలి పనులకు వెళ్లిన ఆయన సాయంత్రం ఇంటికి వెనుదిరిగి వెళుతూ పామిడి స్టేషన్ వద్దకు చేరుకోగానే కుప్పకూలాడు. అపస్మారక స్థితికి చేరుకున్న ఓబులేసును స్థానికులు వెంటనే పామిడి సీహెచ్‌సీకి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు.

వజ్రాల పరిశోధన కేంద్రంలో స్ట్రాటిగ్రాఫిక్ కాలమ్ ఆవిష్కరణ



స్ట్రాటిగ్రాఫిక్ కాలమ్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

వజ్రకరూరు: స్థానిక వజ్రాల ప్రక్రమణ కేంద్రం (జీఎస్‌ఐ)లో ఆదివారం స్ట్రాటిగ్రాఫిక్ కాలమ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి దక్షిణ ప్రాంత జీఎస్‌ఐ ఏడీజీహెచ్‌ఓడీసీహెచ్ వెంకటేశ్వర రావు, ఏపీ ఎస్‌యూ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎస్ఎన్ సత్యనారాయణ మహాపాత్రో తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరై, మాట్లాడారు. భారతదేశంలో రెండవ అతిపెద్ద ప్రోటేరోజోయిక్ బేసిన్‌గా ఖ్యాతిగాంచిన కడప బేసిన్ భౌగోళిక చరిత్రకు స్ట్రాటిగ్రాఫిక్ కాలమ్ ఓ అద్భుత సాక్ష్యంగా నిలుస్తుందన్నారు. కీలకమైన విద్యా, పరిశోధన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఈ స్ట్రాటిగ్రాఫిక్ కాలమ్ దోహదపడుతుందన్నారు. కింబర్‌లైట్, ల్యాం ప్రోయిట్ల ప్రదర్శనతో పాటు కడప బేసిన్ ప్రాముఖ్యతను ఈ కాలమ్ తెలుపుతుందన్నారు. భారతదేశంలో హైదరాబాద్ తర్వాత రెండవ స్ట్రాటిగ్రాఫిక్ కాలమ్‌ను వజ్రకరూరులో ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఏపీ భూగర్భశాస్త్రంలో కడప సూపర్ గ్రూపు ప్రాముఖ్యత, భౌగోళిక శాస్త్రీయ అవగాహన, అన్వేషణను ప్రోత్సహించడంలో జీఎస్‌ఐ నిబద్ధతను వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు డాక్టర్ అపూర్వబెనర్జీ, రాకేష్ కుమార్ గుప్తా, తరుణ్‌కోలే, వజ్రకరూరు జీఎస్‌ఐ క్యాంప్ ఇన్‌చార్జ్ హరికృష్ణ, జియాలజిస్టులు సుమనమండల్, శ్రీపాతబాల్, కేవీజెడ్పీ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కల్యాణం.. భక్తజన పరవశం



ఉత్సవ మూర్తులకు కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

- వైభవంగా బుగ్గ రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం
- నేత్రపర్వంగా సాగిన రథోత్సవం

తాడిపత్రి అర్బన్: వేలాదిమంది భక్తులు 'ఓంనమః శివాయ' అంటూ చేసిన స్మరణతో దక్షిణ కాశీ క్షేత్రంగా ఖ్యాతిగాంచిన తాడిపత్రిలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం మార్మోగింది. భక్తుల ఓంకార నాదాల మధ్య ఆది దంపతుల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. పంచాక్షరీ విభుని కల్యాణ ఘట్టాన్ని, వైభోగాన్ని ప్రత్యక్షంగా తిలకించేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలిరావడంతో బుగ్గరామలింగేశ్వరస్వామి సన్నిధానం జనసంద్రమైంది. శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య ఘడియల్లో ఆదిదంపతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టు వస్త్రాలను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ యువ నేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, చింతల వేంకటరమణస్వామి ఆలయ ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు వేలూరి మురళీప్రసాధరెడ్డి సమర్పించారు. శాస్త్రోక్తంగా సాగిన కల్యాణ క్రతువును చూసి భక్తులు పులకించిపోయారు. హరహర మహాదేవ.. శంభోశంకర అంటూ పునీతులయ్యారు. వేడుక అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. వేడుకలో దాదాపు 10వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం బ్రహ్మ రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. రాజరాజేశ్వరీదేవితో కలసి బుగ్గ రామలింగేశ్వరుడి ఉత్సవ మూర్తులను రథంపై అధిష్ఠింపజేసి మెయిన్ బజార్, పాత ఆంధ్రాబ్యాంక్ నుంచి తిరిగి రథశాల వరకూ రథాన్ని లాగారు. భక్తులకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అల్పాహారం, మజ్జిగ, చల్లని పానీయాలు అందించారు. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తహసీల్దార్ ఆంజనేయులు, డీఎస్పీ గంగయ్య ఆధ్వర్యంలో సీఐలు మురళీకృష్ణ, లక్ష్మీకాంతరెడ్డి, రోషన్, నాగార్జునరెడ్డి పర్యవేక్షించారు.

యువతి ఆత్మహత్య

తలుపుల: మండలంలోని ఉడమలకుర్తికి చెందిన నాగేశ్వరి, శ్రీరాములు దంపతుల కుమార్తె హరిత (20) ఆత్మహత్య చేసుకుంది. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న ఆమె జీవితంపై విరక్తితో ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. చుట్టుపక్కల వారు గుర్తించి ఆమెను కాపాడి కదిరి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. తండ్రి శ్రీరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు హెడ్‌కానిస్టేబుల్ రవికాంత్ తెలిపారు.

సాయి విద్యార్థుల సంగీత కచేరి



సంగీత విభావరి నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి మహా సమాధి చెంత ఆదివారం సాయంత్రం ముద్దేనహళ్లిలోని సత్యసాయి విద్యాసంస్థల క్యాంపస్ విద్యార్థులు నిర్వహించిన సంగీత కచేరి అలరించింది. చక్కటి భక్తిగీతాలతో వారు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. అనంతరం మహాసమాధిని సందర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా వీరభద్రస్వామి రథోత్సవం



వజ్రకరూరు: మండలంలోని తట్రకల్లులో ఆదివారం సాయంత్రం భద్రకాళి సమేత వీరభద్ర స్వామి రథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో అభిషేకాలు, రుద్రాభిషేకం తదితర పూజలు చేశారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం రథానికి పూజలు నిర్వహించి, వేలాది మంది భక్తులు లాగారు. భక్తులు రథంపై పండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచు మూరిన్ని ధనలక్ష్మి, ఎంపీటీసీ రామకృష్ణ, అర్చకులు రాఘవేంద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.